# ఇదా ముగింపు?

నరేంద్ర అసహనంగా తిరుగుతున్నాడు. ఆ గదిలో అట్నుంచి ఇటు, ఇట్నుంచి అటు. మనసు అస్తవ్యస్తంగా ఉంది. టైమ్ రాత్రి పదకొండు గంటలు దాటింది. అమ్మ ఇంతవరకు ఇంటికి రాలేదు.

అమ్మంటే నరేంద్రకు చాలా ఇష్టం. అమ్మంటే ఎవరికిష్టం ఉండదు? కాని కొన్ని చేదు అనుభవాలు, ఆశించని కొన్ని అనుభూతులూ నరేంద్ర మనసుకు సమ్మెటలా అయినై. ఏదోబాధ, ఎందరిజీవితాలు అతి సాధారణంగా గడవడం లేదు. తనకే ఈ ఆవేదన ఎందుకో? మర్చిపోదామని చాలా ప్రయత్నించిందా యువ హృదయం. కానీ ముసురుకునే ఆలోచనలనుంచి దూరం జరగడం ఎంత కష్టమో అర్థమవుతుంది. సున్నితమైన మనసుండటం కూడా శాపమేమో!

ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ కారాగిన శబ్దమైంది. బాల్కనీ నుంచి కిందికి చూశాడు నరేంద్ర. తల్లి లలిత కారుదిగుతోంది. పక్కన డ్రైవింగ్‌సీట్లో కూర్చున్నవ్యక్తినిచూస్తూనే మనసు మండిపోయింది. కళ్ళు ఎరుపు వర్ణం దాల్చినై. కడుపు లోంచి బాధ.

లలిత మెట్లెక్కి పైకి వచ్చిందాకా సాగిపోతున్న ఆ కారువైపు చూస్తూ నుంచున్నాడు నరేంద్ర. లలిత నరేంద్ర భుజంమీద చెయ్యివేసి 'నరేన్! భోజనం చేశావా?' అంది. నరేంద్ర కదల్లేదు, మాట్లాడలేదు.

"నరేన్! ఒంట్లో బాగాలేదా" కొడుకు నుదుటిమీద చెయ్యివేసి చూస్తూ ఆందోళనగా అడిగింది.

"బాగానే ఉంది" నిర్లిప్తంగా అన్నాడో, ముభావంగా అన్నాడో, కోపంగా అన్నాడో అసలదే భావమో అర్థంకాలేదు లలితకు. నరేంద్రకు క్రోపం వచ్చింది. ఆకోపం ఎందుకు వచ్చిందో ఊహించలేనంత అవివేకి కాదామె. మనసు చివుక్కుమంది.

శ్రీరామ్‌తో తను చనువుగా ఉండటం నరేంద్రకు ఇష్టంలేదు. కానీ ఎన్నోమనస్పర్థల మధ్య నరేంద్ర తండ్రితో లలిత కలిసిబతకలేని పరిస్థితులు ఏర్పడినై.

లలిత నుంచుంటే తప్పు, కూర్చుంటే తప్పు. వంటింటికుందేలుగా ఉండాలి తప్ప బయటికి రాకూడదు. చదువుకోకూడదు. ఇదీ లలిత భర్త మనస్తత్వం. కొన్నాళ్ళు ఆమెసహనం వహించింది. కలిసి కాపురం చెయ్యక తప్పదు. కన్న పసిబిడ్డకు మనస్తాపం కలిగించకూడదు. అని గుండె దిటవు చేసుకుని బండరాయిలా కాపురం చేసింది.

కానీ చిన్నప్పుడు చాలాకాలం ఒకే ఊళ్లో ఉండి చనువుగా ఉండిన ప్రభాకర్ చాలాఏళ్ళకు ఒకరోజు లలితను వెతుక్కుంటూ చూడటానికి వచ్చాడు. చిన్నప్పుడు సరదాగా గడిపిన రోజులను నిర్మలంగా తల్చుకుని నవ్వుకుంటున్నప్పుడు అక్కడ అడుగు పెట్టిన ఆమెభర్త రౌద్రమూర్తిలాగా విచక్షణ లేకుండా అతిథి ముందే జుట్టు పట్టుకుని తలగోడకు కొట్టినప్పుడు అణగారిపడిఉన్న ఆమె ఆత్మాభిమానం పడగ విప్పింది. అవ

మానానికి మనసు రగిలింది. అంతే ఆ క్షణమే కాళికలా నిలిచి, ఎదురు తిరిగింది. భర్తగా మన్నిస్తూ వచ్చిన మనిషిని ఒక్కతోపు తోసింది. మరింత క్రోధంగా ముందుకు రాబోయిన అతణ్ణి అడుగు ముందుకువేస్తే తీవ్రపరిణామాలు కలుగుతాయని హెచ్చరించింది.

ఆ తరువాత సంవత్సరానికి కోర్టు ఇద్దరికి విడాకులు మంజూరు చేసింది. లలిత ఆర్థికంగా, మానసికంగా నిలబడటానికి చేయూతనిచ్చి నిలబెట్టాడు మేనమామ రామారావు గారు. అంతే, ఆమాత్రం సహకారంతో హాయిగా చదువుకుంది. ఉద్యోగం సంపాదించుకుంది. నరేంద్ర భవిష్యత్తు ధ్యేయంగా సాగిపోతోంది లలిత జీవితం.

జీవన సహచరుడు లేని లోటు తప్ప స్వేచ్ఛాజీవనమే ఆమెది. నరేంద్ర పెరిగి పెద్దవాడవుతున్నాడు. గడిచిన సంవత్సరం లలిత జీవితంలోకి అనుకోకుండా ప్రవేశించాడు శ్రీరామ్.

అదిగో, అప్పట్నుంచి లలిత తన బతుకులోకి మళ్ళీ వసంతం వచ్చిందనుకుంటే అప్పట్నుంచే నరేంద్ర మనసులోకి కలత ప్రవేశించింది. అతనికి తల్లి శ్రీరామ్‌తో అంత సన్నిహితంగా ఉండటం నచ్చలేదు. ఆ సంబంధం పట్ల అతనికేమాత్రం ఇష్టంలేదు.

ఒకటి రెండుసార్లు చూచాయగా అన్నాడుకూడ ఆ విషయం. అయిష్టత తెలియజేశాడు. లలిత అంది "నేను ఆయన స్నేహం వదులుకోలేన్నా" అని.

అమ్మ పక్షంగా ఆలోచించడానికి ప్రయత్నించాడు నరేంద్ర. ఆమె చేస్తున్న పని సబబు అని మనసు ఒప్పుకోలేకపోయింది. అసలే సెన్సిటివ్ అందులో తనవెనక తన ఫ్రెండ్స్ అనుకునే మాటలు ముల్లులా గుచ్చు తుంటే విలవిల్లాడే పరిస్థితిలో ఉన్నాడతను. అమ్మ ఎందుకిట్లా మారి పోయింది. ఆ వ్యక్తితో తిరిగి నైతికంగా పతనం కావలసిన అవసర మేమిటి?

"ఇన్నాళ్ళుగా నాకు లోపించిన ప్రేమను శ్రీరామ్ వల్ల పొందు తున్నాను" అంది లలిత, నరేంద్ర మాటలకు మరో సమాధానంగా. కానీ సరిపెట్టుకోలేని నరేంద్ర మనసు అతనికి ఎదురుతిరుగుతూనే ఉంది. అమ్మంటే ఉదాసీనత ఏమీచేయలేని నిస్సహాయత- మనసును ఎన్నెన్నో ఆలోచనలకు ఎరచేస్తున్న ఈ సమాజంలో సామాజిక విలువలు ఇంతగా దిగజారిపోతున్నాయా? నరేంద్రలో వర్ణణాతీతమైన బాధ.

ఆ రోజు రోజూ వచ్చినట్లే శ్రీరామ్ వచ్చాడు. తరచు భోజనం చెయ్యడం పరిపాటి అయింది. ఆవేళ కూడా భోజనం చేశాక బయలు దేరుతున్న శ్రీరామ్‌ని లలిత "పొద్దుపోయింది కదా!" ఉండిపొమ్మన్నది. పక్కనే ఉన్న నరేంద్ర చివ్వున తలెత్తి చూశాడు. కానీ ఆ ఇద్దరు నరేంద్రను గమనించలేదు. లలిత, ఆమె వెనుక శ్రీరామ్ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళారు. తలుపులు మూసుకున్నై.

* * *

లలితకు కాళ్లు, చేతులు వణికిపోతున్నై.... ఒళ్ళంతా చెమటలు

పట్టిపోయింది. రైలుపట్టాలమీద గుర్తు తెలియనంతంగా, రైలుకిందపడి నలిగిపోయిన యువకుడు తన కొడుకు కాకూడదని వెయ్యిదేవుళ్ళకి మొక్కుకుంది. కానీ ఆమె వినతి ఒక్కదేవుడు కూడా ఆలకించలేదు. ఆస్పత్రిలో తెల్లటి బట్టను మొహంపై తొలగించగానేచూసింది ఆరిపోయిన తన ఆశలదివ్వె చిగురులోనే ఎండిరాలిన చిగురాకు తన నరేంద్ర.... ఇంత ఘోరానికి కారణం తనా? అనాలోచితంగా గుడ్డిగా ప్రవర్తించిన తను చేసింది తప్పా? లేక నరేంద్ర తొందర పడ్డాడా? పక్కనే ఉన్న శ్రీరామ్ చేతుల్లో నిస్సత్తువగా వాలిపోయిందామె.

భవిష్యత్తు నలిపేసుకున్న నరేంద్ర గతమైపోయినాడు. ఈ ముగింపును వింతగా చూస్తూ కర్మసాక్షి పడమట కృంగిపోయినాడు.

కళామయి, 1986